SAKETH Myneni

ఆటలంటే అతనికి పంచ ప్రాణాలు...

ఫుట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్...ఏదైనా సరే...ఆటలో పడిపోతే అన్నింటినీ మర్చిపోతాడు.

అన్ని ఆటలూ అతనికి ఇష్టమే అయినా...చివరకు ఒకే ఆటపై దృష్టి కేంద్రీకరించాడు.

టెన్నిస్‌పై మనసు లగ్నం చేశాడు... పట్టువదలకుండా సాధన చేసి తనను తాను నిరూపించుకున్నాడు.

అతని పేరు సాకేత్ మైనేని. భారత్ నంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారుడు...

సాకేత్ పుట్టింది కృష్ణాజిల్లా వుయ్యూరు అయినా పెరిగిందంతా విశాఖలోనే. తల్లి ప్రసాదరావు, తల్లి రోజా లకు ఏకైక సంతానమైన సాకేత్ పదకొండవ ఏటనే టెన్నిస్ రాకెట్ పట్టుకున్నాడు. చదువుతోపాటు తనకిష్టమైన ఆటను కొనసాగించాలనుకున్నాడు. ఇంటర్మీడియట్ అయ్యాక 2006లో అమెరికాకు పయనమయ్యాడు. అక్కడ టెన్నిస్ ప్రోగామింగ్ కు సంబంధించిన అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు అందిస్తున్న యూనివర్సిటీ ఆఫ్ అలబామా లో చేరాడు. 2011 వరకు యూనివర్సిటీలోనే ఉంటూ ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్ లో రెండు డిగ్రీలు పూర్తి చేసాడు. దాంతో పాటు టెన్నిస్‌లోనూ మెళకువలు నేర్చుకున్నాడు.

తన కెరీర్‌లో ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లోనే భారత టెన్నిస్ ప్లేయర్ సాకేత్ అందరినీ ఆకట్టుకున్నాడు. కీలకదశలో కాలి కండరాలు పట్టేయడం సాకేత్‌కు ప్రతికూలంగా పరిణమించింది. దాంతో యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో ఈ వైజాగ్ ప్లేయర్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మ్యాచ్‌లో ఓడిపోయినా తన అసమాన పోరాట పటిమతో అందరి మనసులు గెలుచుకున్నాడు సాకేత్. ఒకవేళ ఆ మ్యాచ్‌లో గెలిచుంటే సాకేత్ రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, నంబర్‌వన్ జొకోవిచ్ తో ఆడేవాడు.

చిన్నతనంలోనే తన ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో... నేడు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలు అందుకుంటున్నాడు ఈ ఆటగాడు. చదువుతోపాటు క్రీడలపై ఇష్టాన్ని కొనసాగిస్తే ఊహించని విజయాలు అందుకోవచ్చని నిరూపించిన సాకేత్... 2016 సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో మోస్ట్ పాపులర్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచారు. కంగ్రాట్స్ సాకేత్.